క్లుప్తంగా

విలువలు, విశ్వసనీయతలేని చంద్రబాబు

వైఎస్సార్ సీపీ నేత ఆకుల శ్రీనివాసకుమార్

భవానీపురం(విజయవాడపశ్చిమ): దేశ రాజకీయాల్లో విలువలు, విశ్వసనీయత లేని వ్యక్తి చంద్రబాబు అని వైఎస్సార్ సీపీ రాష్ట్ర నేత ఆకుల శ్రీనివాసకుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాజకీయంగా 40 ఏళ్ల ఇండస్ట్రీ.. అందులో 14 ఏళ్లు సీఎంగా అతను చేసిన మోసాన్ని ప్రజలు మరిచిపోలేదని, ఇంకా బాబును నమ్మే పరిస్థితి లేదని తెలిపారు. కార్ల్ మార్క్స్ ఉంటే చంద్రబాబు మోసకారితనానికి కర్రతో కొట్టేవారేమోనని ఎద్దేవా చేశారు. ప్రజా కోర్టులో చంద్రబాబుకు పరాభవం తప్పదని, రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా మళ్లీ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పగ్గాలు చేపట్టనున్నారని స్పష్టం చేశారు.

26న శ్రీసాయి సత్యవ్రతాలు



భవానీపురం(విజయవాడపశ్చిమ): పవిత్ర కార్తిక మాసం పురస్కరించుకుని భవానీపురం హౌసింగ్‌బోర్డ్‌కాలనీలోని సంకల్ప సిద్ధి శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో ఈ నెల 26వ తేదీ ఉదయం 8.30 గంటలకు శ్రీసాయి సత్య వ్రతాలు నిర్వహించనున్నట్లు ఆలయ పాలకమండలి అధ్యక్షుడు బూర్లె వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్రతంలో పాల్గొనే దంపతులు పట్టు వస్త్రాలు ధరించి రావల్సి ఉంటుందని పేర్కొన్నారు. పూజా సామగ్రి ఆలయ పాలకమండలి సమకూరుస్తుందని పేర్కొన్నారు.

రేపు స్టేడియం ఆవరణలో యోగాపై అవగాహన తరగతులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఎంజీ రోడ్డులోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం ఆవరణలో ఈ నెల 25వ తేదీ శనివారం ఉదయం 6 నుంచి 7.30 గంటల వరకు యోగా అవగాహన తరగతులను నిర్వహిస్తున్నామని కార్పొరేషన్ యోగా కోచ్ సూర్య చంద్రకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యానం అంశాలపై అవగాహన కల్పిస్తామని, ఆసక్తి ఉన్నవారు 93988 76568, 83338 81648, 93901 84906 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

అలరించిన నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ధర్మపథంలో భాగంగా ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో గురువారం పలువురు చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం భక్తులను ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై విజయవాడకు చెందిన ప్రణవం ఆర్ట్స్ అకాడమీకి చెందిన పలువురు చిన్నారులు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. అనంతరం చిన్నారులకు అమ్మవారి దర్శనభాగ్యం కల్పించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): పున్నమి విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని 11కేవీ నేతాజీ ఫీడర్ విద్యుత్‌లైన్ మరమ్మతుల కారణంగా కొన్ని ప్రాంతాల్లో రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీ సీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు పోస్టాఫీస్ రోడ్, బుద్ధావారి వీధి, అండిమాని బ్రహ్మయ్య వీధి, లొల్లావారి వీధి, కామకోటినగర్, అరవింద వీధి, కేసీ పబ్లిక్ స్కూల్ రోడ్, సిమెంట్ రోడ్డు తదితర ప్రాంతాల్లో కరెంట్ నిలిపివేయనున్నట్లు ఆయన వివరించారు.

నిత్యాన్నదానానికి హైదరాబాద్ భక్తుడి విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి హైదరాబాద్‌కు చెందిన భక్తుడు గురువారం రూ. లక్ష విరాళాన్ని అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన ఎండీ కుమారి తన బంధువుల ద్వారా నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళాన్ని ఆలయ ఈవో కె.ఎస్.రామారావుకు అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించిన దేవస్థాన అధికారులు, ప్రసాదాలను ఇచ్చారు.

జగన్ పాలనలో రాష్ట్రం సుభిక్షం

ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు



42వ డివిజన్‌లో సచివాలయంలో డిస్ ప్లే బోర్డు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు తెలిపారు. భవానీపురంలోని 41 డివిజన్‌లో 129వ సచివాలయం, 42 డివిజన్లలో గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు ఆయా డివిజన్లలోని సచివాలయాల్లో ఏర్పాటు చేసిన డిస్ ప్లే బోర్డులను ఆవిష్కరించారు. తొలుత పార్టీ జెండాలను ఎగరవేశారు. అనంతరం స్థానిక పెద్దలతో ముఖాముఖి నిర్వహించారు. గత టీడీపీ ప్రభుత్వానికి, ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మధ్య తేడాను ప్రజలకు వివరించేందుకే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చంద్రబాబు చేసిన మోసాలను రాష్ట్ర ప్రజలకు వివరిస్తున్నామని చెప్పారు. చంద్రబాబు మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు ఎన్ని అమలు చేశారు.. నేడు జగనన్న ఇచ్చిన మేనిఫెస్టో ఎంతవరకు అమలుచేశారు అనేది ప్రజలకు వివరిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు ప్రభుత్వం చేసిన మంచిని కళ్లకు కట్టినట్లు చూపుతున్నామన్నారు. ప్రతి సచివాలయ పరిధిలో జరిగిన అభివృద్ధి.. సంక్షేమ పథకాల వివరాలతో ఆ సచివాలయంలోనే డిస్ ప్లే బోర్డులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. గతంలో చంద్రబాబు పాలనలో అభివృద్ధి కంటే ఆర్భాటం ఎక్కువగా ఉండేదన్నారు. అమరావతి పేరుతో నగర అభివృద్ధిని విస్మరించారన్నారు. నగరానికి కేటాయించిన నిధులు కూడా అమరావతికి మళ్లించి ఇక్కడి ప్రజలను మోసం చేశారన్నారు. నగరంలో రోడ్లు, పార్కులు, తాగునీటి అవసరాలకు వాటర్ ట్యాంకులు, డ్రైనేజీ వ్యవస్థను ఆధునికీకరిస్తున్నామన్నారు. అభివృద్ధి జగన్ నాలుగున్నరేళ్ల పాలనలోనే జరిగిందన్నారు. ఈ విషయాన్ని ప్రజలే అంగీకరిస్తున్నారన్నారు.

బాబు గ్యారెంటీ అవసరం లేదు

చంద్రబాబు భవిష్యత్‌కే గ్యారంటీ లేదని ఎమ్మెల్యే వెలంపల్లి అన్నారు. ఆయన ష్యూరిటీ రాష్ట్ర ప్రజలకు అవసరం లేదన్నారు. ఎవరో ష్యూరిటీ పెడితే రోగాల పేరుతో బెయిల్‌పై చంద్రబాబు బయటకు వచ్చారని ఎద్దేవా చేశారు. అటువంటి వ్యక్తి గ్యారెంటీ, ష్యూరిటీ అంటే ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. కార్యక్రమంలో మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు ఎండీ ఇర్ఫాన్, పడిగపాటి చైతన్యరెడ్డి, గౌస్ మొహిద్దీన్, యశోధర్, రెహమాన్, అజీజ్, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, నాయకులు, కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



డిస్ప్లే బోర్డ్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

జగనన్నతోనే అభివృద్ధి సాధ్యం

భవానీపురం(విజయవాడపశ్చిమ): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే ఏపీ అభివృద్ధి సాధ్యమని పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పేర్కొన్నారు. విజయవాడ రూరల్ మండలం వైఎస్సార్ కాలనీ జక్కంపూడి–3 గ్రామ సచివాలయం పరిధిలో గురువారం జరిగిన పల్లెకు పోదాం, ఏఈపికి జగనే ఎందుకు ముఖ్యమంత్రి కావాలంటే కార్యక్రమంలో ఎండీఓ శేషగిరిరావు, ఈఓ చెన్నకేశవులు, జక్కంపూడి ఎంపీటీసీ బయ్యారపు కల్పన, మండల మాజీ అధ్యక్షులు రవి కిషోర్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జక్కంపూడి–3 సచివాలయం పరిధిలో స్థానికంగా జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వివరాలను తెలియచేసే డిస్‌ప్లే బోర్డ్‌ను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఈ సచివాలయం పరిధిలోని ప్రజలకు వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి రూపంలో రూ.4,69,459,45 ప్రభుత్వం ఖర్చు చేసిందని తెలిపారు. పేదలకు మంచి చేయటంలో సీఎం జగన్ ఎప్పుడూ ముందుంటారని చెప్పారు. 14 ఏళ్ల చంద్రబాబు పాలనకు నాలుగన్నరేళ్ల జగన్ పాలనకు ఉన్న తేడాను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు నక్కా ప్రభుదాస్, తన్నీరు పాపారావు, షేక్ సమీనా, పంచాయతీ కార్యదర్శి రిషి తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య రాముడి అక్షింతల కలశ ఊరేగింపు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): అయోధ్య రాముడి అక్షింతల కలశ ఊరేగింపు గురువారం చిట్టినగర్ పరిధిలో సాగింది. కేఎల్‌రావునగర్‌లో అమ్మవారి ఆలయం నుంచి గురువారం ఉదయం పాలప్రాజెక్టు సమీపంలోని హనుమత్ దీక్షా పీఠం వరకు ఊరేగింపు జరిగింది. మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ శ్రీరామ నామస్మరణతో భక్తులు ఊరేగింపులో పాల్గొన్నారు. బీజేపీ జిల్లా కోశాధికారి అవ్వారు బుల్లాబ్బాయ్ మాట్లాడుతూ అక్షింతల కలశాన్ని హనుమాన్ ఆలయంలో ఉంచి నిత్యం పూజలు చేస్తారన్నారు. జనవరి ఒకటో తేదీ నుంచి శ్రీరామ చంద్రుని చిత్రపటం, అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. జనవరి 22వ తేదీ అయోధ్యలో శ్రీరామచంద్రుని మందిరం ప్రారంభోత్సవం జరగనున్న నేపథ్యంలో అక్షింతలు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు.



చిట్టినగర్‌లో కలశ ఊరేగింపు

కార్యక్రమంలో వీహెచ్‌పీ మహాలక్ష్మి ప్రఖండ అధ్యక్షుడు శివాలయం శ్రీనివాస్, బీజేపీ జిల్లా కోశాధికారి అవ్వారు బుల్లాబ్బాయ్, హిందూ చైతన్య వేదిక నేత దుర్గాప్రసాద్, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు శివకుమార్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కోశాధికారి శివకుమార్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా యాజ్ఞవల్క్య మహర్షి జయంతి

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ప్రాచీన వేద భారతావనిలోని మహర్షుల్లో యాజ్ఞవల్క్య మహర్షి అగ్రగణ్యులని, జనక మహారాజు సభలో రాజగురువుగా ఎన్నో సార్లు వాద ప్రతివాదాల్లో సర్వోత్తముడిగా పేరుగాంచారని రాష్ట్ర ప్లానింగ్‌బోర్డు ఉపాధ్యక్షుడు మల్లాది విష్ణు పేర్కొన్నారు. యాజ్ఞవల్క్య మహర్షి జయంతి వేడుకలు గురువారం సత్యనారాయణపురం శృంగేరి పీఠంలోని శారద ప్రవచన మందిరంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో విష్ణు మాట్లాడుతూ యాజ్ఞవల్క్య మహర్షి సూర్య భగవానుడి ఆశీస్సులతో శుక్ల యజుర్వేదాన్ని అభ్యసించారని కీర్తించారు. యోగంపై ఆయన చెప్పిన విషయాలు యోగ యాజ్ఞవల్క్యమనే పేరుతో నేటికీ ప్రచారంలో ఉన్నాయని చెప్పుకొచ్చారు. ట్రస్ట్ సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ శర్వాణిమూర్తి, యాజ్ఞవాల్క్య బ్రాహ్మణ సేవా ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



యాజ్ఞవల్క్య మహర్షి జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే మల్లాది విష్ణు

ఆర్‌బీకేలో జేసీ తనిఖీ

విజయవాడరూరల్: ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ పి.సంపత్‌కుమార్ గురువారం జక్కంపూడిలోని రైతుభరోసా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు కోసం రైతుభరోసా కేంద్రంలో చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. ముఖ్యంగా గోనె సంచులు, తేమ కొలుచు సాధనం, కంప్యూటర్ ప్రింటర్, అంతర్జాల (ఇంటర్నెట్) సౌకర్యం, ధాన్యం కొనుగోలు లో ఉపయోగించు పరికరాల లభ్యతను పరిశీలించారు. రైతు భరోసా కేంద్రంలోని సాంకేతిక సహాయకులు, కంప్యూటర్ ఆపరేటర్లు, హెల్పర్లు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బందులు లేకుండా ఆర్‌బీకే సిబ్బంది సహకరించాలని ఆదేశించారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయటంలో దళారులకు, మధ్యవర్తులకు, మిల్లర్లకు స్థానం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలులో ఎటువంటి సమస్య ఎదురైనా జిల్లా సివిల్ సప్లయిస్ మేనేజర్ కార్యాలయంలోని కంట్రోల్ రూం నెంబర్ 7702003571కు ఫోను చేసి సమస్యను పరిష్కరించుకోవాలన్నారు. జేసీతోపాటు రూరల్ మండల తహసీల్దార్ కె.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



బ్యాడ్మింటన్ టోర్నీ విజయవంతానికి కృషి

కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడలో ఈ ఏడాది డిసెంబర్ 12 నుంచి 16 వరకు ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో అండర్–19 బ్యాడ్మింటన్ జాతీయ టోర్నమెంటు జరుగుతుందని, టోర్నీని విజయవంతం చేసేందుకు సమష్టిగా కృషి చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు పిలుపునిచ్చారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఎస్‌జీఎఫ్ ప్రతినిధులు కలెక్టర్ ఢిల్లీరావును కలిసి టోర్నీ విశేషాలను వివరించారు. అండర్–19 బాలురు, బాలికల కేటగిరీల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల క్రీడామైదానంలో ప్రారంభ వేడుకలు జరుగుతాయని.. సీఆర్‌ఎంసీ ఇండోర్ స్టేడియంలో పోటీలు జరుగుతాయన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో టోర్నీ కన్వీనర్ సి.శివ సత్యనారాయణరెడ్డి, స్టేట్ అండర్–19 స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీ భానుమూర్తిరాజు, టోర్నీ ఆర్గనైజింగ్ సెక్రటరీ రవికాంత, సిద్ధార్థ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు, ఫిజికల్ డైరెక్టర్ నారాయణరావు పాల్గొన్నారు.

ఆర్చర్ జ్యోతి సురేఖ దేశానికే గర్వకారణం



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన వెన్నం జ్యోతి సురేఖ దేశానికే గర్వకారణమని కలెక్టర్ ఎస్ ఢిల్లీరావు అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో అంతర్జాతీయ ఆర్చర్, డెప్యూటీ కలెక్టర్ వెన్నం జ్యోతి సురేఖ గురువారం కలెక్టర్ ఢిల్లీరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల చైనాలో జరిగిన ఆసియా క్రీడల్లో మూడు బంగారు పతకాలు, బ్యాంకాక్‌లో నవంబర్ 3 నుంచి 10 వరకు జరిగిన 23వ ఆసియా ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో వ్యక్తిగత రజతం, టీం స్వర్ణ పతకాన్ని సాధించిన జ్యోతి సురేఖను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్రం నుంచి భారత జట్టుకు క్రీడాకారులు ప్రాతినిధ్యం వహిస్తుంటే వారిలో జిల్లా నుంచి ఎక్కువ మంది ఉండటం శుభపరిణామమని కలెక్టర్ ఢిల్లీరావు అన్నారు.

శరణు శరణు దుర్గాభవానీ..

ఇంద్రకీలాద్రిపై గురువారం కనకదుర్గమ్మ మండల దీక్షలు ప్రారంభమయ్యాయి. పూజా కార్యక్రమాల తర్వాత మాలధారణ జరిగింది. అమ్మవారి ఉత్సవమూర్తిని ఊరేగింపుగా తీసుకొచ్చారు. దీక్షాధారులు జై భవానీ.. జైజై భవానీ అంటూ నామస్మరణ చేశారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ





బీఎల్వోలకు సహకరించాలి



డోర్ టు డోర్ ఓట్ వెరిఫికేషన్ చేస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): ఓటర్ల పరిశీలన పక్కాగా జరగాలని, బీఎల్వోలకు సహకరించాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ అన్నారు. ఆయన గురువారం ఇందిరానాయక్ నగర్, తోట వారి వీధి, అజిత్‌సింగ్‌నగర్, ఎక్సెల్ ప్లాంట్ వెనుక ఉన్న జేఎన్ఎన్యూఆర్ఎం గృహసముదాయంలో నివసిస్తున్న ప్రజల ఓట్లను తానే స్వయంగా ఫీల్డ్ వెరిఫికేషన్ చేశారు. స్థానికంగా నివసిస్తున్నవారు ఎక్కడినుంచి వచ్చారు, ఎంత కాలం క్రితం వచ్చారు, వారి ఓట్లు ఎక్కడ ఉన్నాయి, స్థానికంగా అందుబాటులో ఉన్న పోలింగ్ స్టేషన్ తదితరాలను పరిశీలించారు. ఓటర్ గుర్తింపు కార్డుల్లో ఎలాంటి మార్పులు చేయాలన్న డిసెంబర్ 5వ తేదీ లోపు చేసుకోవాలన్నారు. పేరులో కానీ చిరునామాలో కానీ ఏదైనా తప్పులు సరి చేసుకోవాలన్నా, పాత ఫొటోని కొత్త ఫొటోతో మార్చాలన్న తమ బీఎల్వో ద్వారా కానీ, ఓటర్ హెల్ప్ లైన్ యాప్ ద్వారా కానీ, ఎన్.వి.ఎస్.పి పోర్టల్ ద్వారా కానీ, మార్పులు చేసుకోవచ్చని తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలో దరఖాస్తు చేస్తే సమస్య పూర్తిగా పరిష్కారమవుతుందన్నారు.

ట్రాఫిక్ ఉల్లంఘనకు పాల్పడితే చర్యలు

ట్రాఫిక్ ఏడీసీపీ ప్రసాదరావు



కౌన్సిలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ ఏడీసీపీ ప్రసాదరావు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): నగరంలో ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ట్రాఫిక్ ఏడీసీపీ డి.ప్రసాదరావు వాహన చోదకులను హెచ్చరించారు. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టీకే రాణా ఆదేశాల మేరకు బుధవారం నగరంలో మోటారు వాహన చట్టం ఉల్లంఘనపై ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ట్రిపుల్ డ్రైవింగ్ చేస్తున్న 52 మంది వాహన చోదకులపై కేసులు నమోదు చేశారు. గురువారం వ్యాస్ కాంప్లెక్స్‌లోని ట్రాఫిక్ కార్యాలయంలో ఏడీసీపీ ప్రసాదరావు ఉల్లంఘనలకు పాల్పడిన వారు, వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ప్రధానంగా ట్రిపుల్ డ్రైవింగ్ చేసిన వాహన చోదకుల తల్లిదండ్రులకు వారి పిల్లలపై జాగ్రత్త వహించాలని చెప్పారు.

అనంతరం ఇంకెప్పుడూ ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించం అని వారితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ రామచంద్రరావు పాల్గొన్నారు.

సిద్ధార్థలో నేడు కురుక్షేత్ర–2023



పోస్టర్‌ను ఆవిష్కరించిన కళాశాల డీన్ రాజేష్, ప్రిన్సిపాల్ రమేష్, అధ్యాపకులు, విద్యార్థులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విద్యార్థులకు ఈ నెల 24వ తేదీ శుక్రవారం ఉదయం 10 గంటలకు సిద్ధార్థ ఆడిటోరియంలో కురుక్షేత్ర–2023 పేరుతో వివిధ అంశాల్లో రాష్ట్ర స్థాయిలో పోటీలు నిర్వహిస్తున్నామని పీబీ సిద్ధార్థ కళాశాల డీన్ రాజేష్ సీ జంపాల చెప్పారు. సిద్ధార్థ కళాశాల ఆవరణలోని సెమినార్ హాల్లో గురువారం కురుక్షేత్ర–2023 పోటీల పోస్టర్‌ను ఆవిష్కరించారు. రాజేష్ మాట్లాడుతూ బిజినెస్ క్విజ్, యంగ్ మేనేజర్, మార్కెట్ మేకర్స్, స్టాక్ గేమ్, హెచ్‌ఆర్ ఈవెంట్, సృజన, నర్తనశాల, స్టార్టప్ బిజినెస్ ఐడియా, మిస్టర్ అండ్ మిస్ కురుక్షేత్రతో పాటుగా వివిధ సాంస్కృతికాంశాల్లో పోటీలు జరుగుతాయని వివరించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 800 మందికి పైగా ఆన్‌లైన్ ద్వారా పేర్లు నమోదు చేసుకున్నారని చెప్పారు. ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు అతిథిగా హాజరవుతారన్నారు. పోటీల విజేతలకు సాయంత్రం బహుమతులు అందజేస్తామన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్, కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగాధిపతి రెహమాన్, విద్యార్థులు పాల్గొన్నారు.

అలరించిన ఫ్యాషన్ షో



ఫ్యాషన్ డ్రెస్‌లతో వాకింగ్ చేస్తూ మోడల్స్ తళుక్కుమన్నారు. హైలైఫ్ బ్రైడ్స్ సంస్థ నగరంలోని ఓ హోటల్‌లో గురువారం ఫ్యాషన్ షో నిర్వహించింది. లేటెస్ట్ డిజైన్ డ్రెస్‌లతో మోడల్స్ ర్యాంప్ వాక్ చేశారు. ఏటా నిర్వహించే ఫ్యాషన్ ఎక్స్‌పో ఈ నెల 29, 30 తేదీల్లో జరుగుతుంది.

–గుణదల (విజయవాడ తూర్పు)

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నూతన రంగాల్లో వచ్చిన అవకాశాలను విద్యార్థులు అందిపుచ్చుకొని ముందుకు సాగాలని కృష్ణా విశ్వవిద్యాలయం ఫ్యాకల్టీ ఆఫ్ సైన్సెస్ డీన్ ఆచార్య ఎంవీ బసవేశ్వరరావు అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యాన 'రసాయనశాస్త్రంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పాత్ర, ప్రస్తుత ప్రగతి, రానున్న పరిస్థితులు' అంశంపై రెండు రోజులు జరిగిన జాతీయ సదస్సు గురువారం ముగిసింది. ఈ సందర్భంగా ఆచార్య బసవేశ్వరరావు మాట్లాడుతూ రసాయనశాస్త్రం సమాజ వికాసానికి, మనుగడకు చాలా కీలకమైనదన్నారు. నేడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా రసాయనశాస్త్రంలో మరిన్ని ఆవిష్కరణలు వస్తే సమాజానికి మరింత మేలు జరుగుతుందని వివరించారు. ఔషధ తయారీ, నిర్ధారణ, సమాచార విశ్లేషణ తదితర అంశాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పాత్ర పెరగడంతో ప్రజలకు మరింత త్వరితగతిన ఫలితాలు అందుతాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థులకు నూతన ఆవిష్కరణలను తెలియజేసేందుకు నిరంతరం వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. వాటిని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఐఐసీటీ(హైదరాబాద్) సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ సురేష్‌బాబు, విట్ విశ్వవిద్యాలయం ఏపీ రసాయనశాస్త్ర విభాగ ఆచార్యులు డాక్టర్ బందుమజుమదార్, ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం రసాయనశాస్త్ర విభాగ ఆచార్యులు డాక్టర్ వీఎస్ బస్వంత్ ఓరుగంటి, రవ్వ మహేష్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆచార్య ఎంవీ బసవేశ్వరరావు

విజ్ఞానశాస్త్ర ఆవశ్యకతను తెలిపేందుకు సైన్స్ ఎక్స్ పో

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజ్ఞాన శాస్త్ర ఆవశ్యకతను తెలియజేసేందుకే సైన్స్‌ఎక్స్‌పో ఏర్పాటు చేసినట్లు విజన్ ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి వై పార్థసారథి, ఐకాన్ స్కూల్ చైర్మన్ కె.రాజేంద్ర అన్నారు. గురువారం ఐకాన్ పబ్లిక్ స్కూల్ క్యాంపస్‌లో సైన్స్ ఎక్స్‌పో ను ప్రారంభించిన వారు మాట్లాడుతూ మూడు రోజుల పాటు ఈ సైన్స్ ఎక్స్ పో జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఇన్నర్ వీల్ క్లబ్ ప్రెసిడెంట్ స్వరూప, ప్రిన్సిపల్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.